క్లుప్తంగా

కొనసాగుతున్న హమాలీల సమ్మె



నిరసన తెలుపుతున్న కార్మికులు

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని మార్కెట్ యార్డు గోదాము ఎదుట హమాలీల సమ్మె మంగళవారం ఏడో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా సీఐటీయూ కార్యదర్శి గోపాల్, స్వాములు, మహమ్మద్ గౌస్ మాట్లాడుతూ.. 13 నెలలుగా పెండింగ్‌లో ఉన్న హమాలీ కూలీల నిధులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 9 నెలలు పూర్తి కావస్తున్నా కార్మికులకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమైందన్నారు. పెండింగ్‌లో ఉన్న ఈపీఎఫ్ కేసులను రద్దు చేయాలని కోరారు. సమస్యలు పరిష్కరించకపోతే విజయవాడలో మార్చి 7న డీఎం కార్యాలయాన్ని ముట్టడిస్తామని తెలిపారు.

రెండు ఇసుక టిప్పర్లు పట్టివేత



ఇసుక టిప్పర్లు

శిరివెళ్ల: కడప-కర్నూలు జాతీయ రహదారిపై యర్రగుంట్ల వద్ద సోమవారం రాత్రి పోలీసులు రెండు ఇసుక టిప్పర్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నైట్ పెట్రోలింగ్‌లో భాగంగా డీఎస్పీ ప్రమోద్ కడప నుంచి నంద్యాల వైపు ఇసుక లోడ్డుతో వెళ్తున్న టిప్పర్లను పట్టుకున్నారు. మంగళవారం పోలీసులు టిప్పర్ల డ్రైవర్లను విచారించారు. రికార్డులను పరిశీలించి మరింత విచారణ కోసం మైనింగ్ డిపార్ట్‌మెంట్‌కు పంపారు. టిప్పర్లలో సుమారు 80 టన్నుల ఇసుక ఉన్నట్లు సమాచారం.

ఈ-క్రాప్ నమోదు తప్పనిసరి



మాట్లాడుతున్న ఏఓ ప్రమీల

దొర్నిపాడు: రబీలో సాగుచేసిన పంటలకు ఈ-క్రాప్ నమోదు తప్పనిసరి అని మండల వ్యవసాయాధికారి ప్రమీల అన్నారు. మంగళవారం మండలంలోని గుండుపాపల, క్రిష్టిపాడు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మార్చి 1వ తేదీ వరకు సమయం ఉందన్నారు. అలాగే ఫార్మర్ రిజిస్ట్రీ వెంటనే చేయించుకోవాలని పేర్కొన్నారు. ఏఈఓ సాయి, వీఏఏలు గురుగోవర్ధన్, రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయాధికారిగా సునీత



రుద్రవరం: మండల ఇన్‌చార్జ్ వ్యవసాయాధికారిగా సునీత మంగళవారం బాధ్యతలు తీసుకున్నారు. ఇక్కడ ఏఓగా విధులు నిర్వహిస్తున్న నాగేంద్ర ప్రసాద్ సెలవుపై వెళ్లారు. దీంతో ఉన్నతాధికారులు అనంతపురం జిల్లా కదిరిలో పనిచేస్తున్న సునీతను ఇన్‌చార్జ్ ఏఓగా నియమించారు. మొదటి రోజు నర్సాపురం, టి.లింగందిన్నె గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొన్నారు. రైతులతో మాట్లాడుతూ.. ప్రతి రైతు ఫార్మర్ రిజిస్ట్రేషన్ నంబర్ కలిగి ఉండాలని తెలిపారు. ఆ నంబర్ కోసం పొలం పాస్ పుస్తకం, ఆధార్‌కార్డుకు లింకు అయిన సెల్ తీసుకొని రైతు సేవా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. యూనిక్ ఐడీ నంబర్ ఉన్న రైతులకు ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందుతాయని తెలిపారు.

మహిళా సాధికారతపై పోటీలు



పోస్టర్లను విడుదల చేస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని రామకృష్ణ అటానమస్ డిగ్రీ కళాశాలలో మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళా సాధికారత– ఉమెన్స్ డే క్రియేటివ్ కాంటెస్ట్ అంశంపై పోటీలు నిర్వహించనున్నారు. ఈ మేరకు మంగళవారం డైరెక్టర్ హేమంత్‌రెడ్డి ఆధ్వర్యంలో పోస్టర్లను విడుదల చేశారు. ఇన్‌స్టాగామ్ డిజిటల్ పోస్టల్ మేకింగ్, రీల్ మేకింగ్ 30.60 సెకన్లు, యూట్యూబ్ వీడియోలు 5 నిమిషాలతో రూపొందించాల్సి ఉంటుందన్నారు.

జాతీయ ఉపకార వేతనాలకు ఎంపిక

శిరివెళ్ల: మండలంలో జాతీయ ప్రతిభా ఉపకార వేతనాలకు ముగ్గురు విద్యార్థులు ఎంపికయ్యారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన 8వ తరగతి విద్యార్థి కటిక షాఫియా, యర్రగుంట్ల జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన నాజీయా, నందిని ఎంపికయ్యారు. హెచ్ఎం విజయకుమార్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ఎంపికైన విద్యార్థులకు 9,10, ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరాల్లో ఏడాడికి రూ. 12 వేల చొప్పున ఉపకార వేతనాలు అందిస్తుందని తెలిపారు.

నవనందుల దర్శనం..

సర్వపాప హరణం

- నంద్యాల చుట్టూ కొలువుదీరిన పరమేశ్వరుడు
- శివరాత్రి సందర్భంగా మారుమోగుతున్న ఓంకార నాదం

నంద్యాల(వ్యవసాయం): నంద్యాల జిల్లా శైవ క్షేత్రాలకు నెలవు. పరమేశ్వరుడు ఒక్కో క్షేత్రంలో ప్రత్యేకతతో కొలువుదీరి భక్తులను ఆశీర్వదిస్తున్నారు. నల్లమల అటవీ ప్రాంతం, ఎర్రకొండలు, గుట్టల్లో పచ్చని వృక్షసంపద మధ్య వెలసిన శైవక్షేత్రాలు మహాశివరాత్రి ప్రత్యేక పూజలకు ముస్తాబయ్యాయి.

సర్వం శివోహం

దక్షిణ భారత దేశంలో అత్యంత శక్తివంతమైన శైవ క్షేత్రాలకు వెళ్లాలంటే నంద్యాల నుంచే వెళ్లాల్సి ఉంటుంది. శివరాత్రి బ్రహ్మోత్సవాలు ప్రారంభం కావడంతో పట్టణం శివ భక్తులతో కిటకిటలాడుతోంది. నంద్యాలకు 20కి.మీ దూరంలో నల్లమల అటవీ ప్రాంతంలో వెలసిన నవనందుల్లో నంద్యాల పట్టణంలో మూడు నందులు వెలిశాయి. ఒక్కో నందికి ఒక్కో ప్రాధాన్యత ఉంటుంది. మహానందికి వెళ్లలేని భక్తులు నంద్యాల పట్టణంలో వెలసిన నవనందుల్లో ప్రథమ నంది, నాగనంది, సోమనంది ఆలయాలను సందర్శిస్తూ స్వామివారి కటాక్షం పొందుతుంటారు. మూలమఠం క్షేత్రంలో భీమేశ్వరస్వామి కొలువై ఉన్నారు. గాంధీచౌక్ సమీపంలోని కాళికాంబ ఆలయంలో చంద్రశేఖరస్వామి, గుడిపాటిగడ్డలోని మల్లికార్జునస్వామి దేవాలయం, సంజీవనగర్ రామాలయంలో కాశీవిశ్వనాథస్వామి కొలువుదీరి నిత్య పూజలను అందుకుంటున్నారు. నంద్యాల పట్టణంలోని క్షేత్రాలతో పాటు చుట్టుపక్కల ఉన్న శైవ క్షేత్రాలకు నంద్యాల నుంచి ఆర్టీసీ బస్సులు, ప్రైవేటు వాహనాల ద్వారా పెద్ద ఎత్తున భక్తులు సందర్శిస్తారు. బుధవారం శివరాత్రి పండుగ రోజు పగలు స్థానిక దేవాలయాలను సందర్శించి రాత్రి పూట జాగారణ కోసం పారుగు క్షేత్రాలకు వెళ్లి ఉదయం తిరిగి నంద్యాల పట్టణానికి చేరుకుంటారు.

నవనందుల పర్యటన ఇలా....

నంద్యాల పరిసర ప్రాంతాల్లో ఉన్న నవనంది క్షేత్రాలను మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భక్తులు సందర్శిస్తే పాపాలు తొలుగుతాయని, సిరి సంపదలు కలుగుతాయని భక్తుల నమ్మకం. భక్తులు నంద్యాల నుంచి మహానంది క్షేత్రంలో వెలసిన మహానందీశ్వరుడు, కామేశ్వరి ఆలయానికి వెళ్లడానికి ఉదయమే కాలి బాటతో బయల్దేరుతారు. నంద్యాలలోని మల్లికార్జున స్వామి ఆలయంలో దర్శనం చేసుకుని పట్టణంలోని ప్రథమ నంది, సోమనంది, బ్రహ్మనంది దర్శనం చేసుకుని కొత్తపల్లె, వెంగళరెడ్డిపేట గ్రామాల మీదుగా కడమలకాల్వలో వెలిసిన శివనందిని దర్శనం చేసుకుంటారు. ఆ తర్వాత తెలుగుగంగ కాల్వ మీదుగా కృష్ణనంది క్షేత్రాన్ని దర్శనం చేసుకుని మహానందీశ్వర క్షేత్రం చేరుకుంటారు. అక్కడి నుంచి మహానంది క్షేత్ర శివార్లలో గరుడ నందిని దర్శనం తర్వాత సూర్యనంది క్షేత్రానికి వెళ్లి అక్కడ పూజలు నిర్వహించిన అనంతరం తిరిగి మల్లికార్జున స్వామిని దర్శించుకొని యాత్రను ముగించుకుంటారు.



నందులను దర్శించుకొనే రూట్‌మ్యాప్ చిత్రం

ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఉయ్యాలవాడ: స్థానిక మోడల్‌స్కూల్‌లో 6వ తరగతి ప్రవేశం కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ శ్రీనివాసులు రెడ్డి మంగళవారం తెలిపారు. మార్చి 31వ తేదీలోగా 5వ తరగతి చదువుతున్న విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. ఓసీ, బీసీ విద్యార్థులు రూ. 150, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ. 75 రుసుం చెల్లించాలని చెప్పారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఏప్రిల్ 20వ తేదీ ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు. విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఆలయాల వద్ద మెరుగైన విద్యుత్ సౌకర్యం

నంద్యాల(అర్బన్): మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శైవ క్షేత్రాలైన మహానంది, ఓంకార ఆలయాల వద్ద మెరుగైన విద్యుత్ సౌకర్యం కల్పించినట్లు ఎగ్జిక్యూటివ్ ఇంజినీరింగ్ ఆపరేషన్ డివిజన్ అధికారి శ్రీనివాసరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ లోడ్‌కు అనుగుణంగా తగినన్ని ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశామని చెప్పారు. లోకేషన్ల వారీగా సిబ్బందిని నియమించామని, అన్ని డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు, సంబంధిత 11 కేవీ ఫీడర్‌లో మెయింటెనెన్స్ పనులు పూర్తి చేశామన్నారు. అదే విధంగా 33/11 కేవీ సబ్ స్టేషన్లలో కూడా సిబ్బందిని ప్రత్యేకంగా నియమించామని పేర్కొన్నారు. అత్యవసర సమయాల్లో శ్రీనివాసులు రెడ్డి డీఈ 9440813323, సుబ్రమణ్యం ఏడీఈ 9440813347, ప్రభాకర్‌రెడ్డి ఏఈ 9440813400 నంబర్లను సంప్రదించాలని తెలిపారు.

ఫారంపాండ్స్‌పై దృష్టి సారించండి



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీఓ

ఉయ్యాలవాడ: జాతీయ ఉపాధి హామీ పథకం కింద రైతు పొలాల్లో ఫారంపాండ్స్ నిర్మించేందుకు ఉపాధి సిబ్బంది దృష్టి సారించాలని ఏపీఓ రవిప్రకాష్ సూచించారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 5 ఎకరాల్లోపు పొలం ఉన్న రైతులను కలిసి ఫారంపాండ్స్ గుంతలు తవ్వేలా వారికి అవగాహన కల్పించాలన్నారు. వర్షపు నీటిని నిల్వ చేసుకోవడం ద్వారా పంటకు నీటి తడులు ఇచ్చుకుని కాపాడుకునేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. 2025–26 ఆర్థిక సంవత్సరానికి అవసరమైన ఉపాధి పనులు ప్రణాళికాబద్ధంగా గ్రామసభల తీర్మాణంతోనే రైతులకు అవసరమైన పనులను చేపట్టాలని సూచించారు. కూలీల సంఖ్య పెంచాలన్నారు.

ఎరువుల దుకాణంపై చర్యలు

సాక్షి ఎఫెక్ట్



రికార్డులను పరిశీలిస్తున్న ఏఓ రంగనేతాజి

చాగలమర్రి: మండల కేంద్రంలోని న్యూ శ్రీలక్ష్మీవెంకటేశ్వర ఎరువుల దుకాణ లైసెన్సును ఏఓ రంగనేతాజి తాత్కాలికంగా రద్దు చేశారు. బ్లాక్‌లో యూరియా విక్రయాలపై ఈ నెల 8, 21వ తేదీల్లో సాక్షిలో ప్రచురితమైన వార్తలపై అధికారులు స్పందించారు. ఏఓ మంగళవారం న్యూ శ్రీవెంకటేశ్వర ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేశారు. యూరియా బస్తాలను అధిక ధరలకు విక్రయించినట్లు తెలియడంతో గోదాములో నిల్వ ఉన్న యూరియా బస్తాలను సీజ్ చేశారు. 6ఏ సెక్షన్ కింద కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. అదే విధంగా 15 రోజుల పాటు దుకాణ లైసెన్సును సస్పెండ్ చేసి విక్రయాలను నిలుపుదల చేసినట్లు చెప్పారు.



నర్సాపురం రైస్‌మిల్ వద్ద ఆదర్శ పాఠశాల విద్యార్థులు

క్షేత్ర సందర్శనతో పరిజ్ఞానం

రుద్రవరం: బడిలో పాఠాలు చెప్పడంతో పాటు క్షేత్ర సందర్శనతో విద్యార్థుల్లో పరిజ్ఞానం మరింత పెంపొందుతుందని రుద్రవరం ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ సంగెపు నాగేశ్వరరావు అన్నారు. మంగళవారం ఆదర్శ పాఠశాల, కళాశాల విద్యార్థులు ఇండస్ట్రియల్ విజిట్‌లో భాగంగా రుద్రవరంలోని పాలశీతల కేంద్రం, నర్సాపురం రైస్‌మిల్‌లను సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులు రైస్ మిల్ వద్ద వడ్ల నుంచి బియ్యం తయారీ, అందుకు వినియోగించే యంత్రాల పనితీరును యజమానిని అడిగి తెలుసుకున్నారు. అలాగే పాలశీతలీ కేంద్రం వద్ద పాల సేకరణ, శీతలీకరించే విధానాన్ని పరిశీలించారు.

మహిళల జీవనోపాధికి రుణాలు

మహానంది: మహిళలకు జీవనోపాధి కల్పించేందుకు స్వయం సహాయక సంఘాల్లో రుణాలు ఇస్తున్నట్లు జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ జవహర్‌బాబు తెలిపారు. బుక్కాపురంలోని పొదుపు సమాఖ్య భవనంలో మంగళవారం సమావేశం నిర్వహించారు. జీఎం జవహర్‌బాబు మాట్లాడుతూ పరిశ్రమల శాఖ ద్వారా మహిళలకు చిన్నచిన్న పరిశ్రమలు ఏర్పాటు చేసుకునేందుకు రుణాలు అందిస్తున్నామన్నారు. కుటీర పరిశ్రమలు ఏర్పాటు, మార్కెటింగ్ చేసుకోవడంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఐపీఓ చంద్రశేఖర్, ఏపీఎం తిరుపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

సర్వర్ మొరాయింపు

- నెమ్మదిగా సాగుతున్న ఫార్మర్ రిజిస్ట్రీ
- దగ్గర పడుతున్న గడువు
- ఆందోళనలో రైతులు

దొర్నిపాడు: అన్నదాతలు ఫార్మర్ రిజిస్ట్రీలో తమ వివరాలు నమోదు చేసుకోవడానికి గడువు సమీపిస్తోంది. ప్రస్తుతం ఆయా సచివాలయ పరిధిలోని రైతు సేవా కేంద్రాల్లో గ్రామ వ్యవసాయ సహాయకులు రైతుల వివరాలను ప్రత్యేకంగా నమోదు చేస్తున్నారు. కానీ తుది గడువు మార్చి 3 కావడంతో రైతులు కార్యాలయ చుట్టు తిరుగుతున్నారు. కారణం ఏమంటే సర్వర్ పనిచేయడం లేదని రేపు రాపోండంటూ అధికారులు ఇళ్లకు పంపుతున్నారు.

ఆరురోజుల్లో 40 శాతం సాధ్యమేనా

మండలంలో 5,492 మంది రైతులు ఉండగా ఇప్పటి వరకు 3,420 మంది మాత్రమే ఫార్మర్ రిజిస్ట్రీ చేసుకున్నారు. ఇంకా 2,072 మంది రైతులు మిగిలి ఉన్నారు. నెల రోజుల నుంచి చేస్తున్నా కేవలం 60 శాతం మాత్రమే నమోదైంది. మిగిలిన ఆరు రోజుల్లో వందశాతం పూర్తి కావాలంటే 40 శాతం ఉంది.

మండలంలో ఇప్పటి వరకు ఫార్మర్ రిజిస్ట్రీలో నమోదైన వివరాలు

గ్రామం	మొత్తం రైతులు	రిజిస్ట్రీ అయిన రైతులు	శాతం
అర్జునాపురం	225	173	76.9
బుర్రారెడ్డిపల్లె	129	73	56.6
చాకరాజువేముల	1,116	666	59.7
దొర్నిపాడు	1069	627	58.7
గుండుపాపల	460	345	75.0
కొండాపురం	223	184	82.5
క్రిష్టిపాడు	429	346	80.7
రామచంద్రాపురం	568	226	38.6
డబ్ల్యూ గోవిందిన్నె	1,255	780	62.2
మొత్తం	5,492	3,420	62.3

ఆందోళనలో రైతులు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఏ పథకం ఇవ్వకపోయినా రైతులను మాత్రం భయభ్రాంతులకు గురిచేస్తుంది. ఫార్మర్ రిజిస్ట్రీ చేసుకుంటేనే ప్రభుత్వ పథకాలు వర్తిస్తాయని చెప్పడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. గత మూడు రోజుల నుంచి సర్వర్ పనిచేయడం లేదని సంబంధిత అధికారులు పేర్కొనడంతో రైతులు కంగారు పడుతున్నారు.



చాకరాజువేముల సచివాలయంలో ఫార్మర్ రిజిస్ట్రీ కోసం వచ్చిన రైతులు



విద్యుద్దీపాలంకరణలో ప్రథమనంది ఆలయం



ముస్తాబవుతున్న బైటిపేట ఆంజేయస్వామి ఆలయం

మహాశివరాత్రి ఉత్సవాలకు ముస్తాబు

నంద్యాల(వ్యవసాయం): మహాశివరాత్రి ఉత్సవాలకు పట్టణంలోని ఆలయాలు ముస్తాబవుతున్నాయి. బుధవారం రాత్రి లింగోద్భవం తర్వాత శివ పార్వతుల కళ్యాణాన్ని నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయాల వద్ద బారికేట్లు, చలువ పందిళ్లు, తాగునీటి సౌకర్యం కల్పించారు.

- బ్రహ్మనందీశ్వర స్వామి, కాళికాంబ చంద్రశేఖర, మల్లికార్జునస్వామి, భీమలింగేశ్వర ఆలయాల్లో విశేష పూజలు జరగనున్నాయి.
- నవనందుల్లోని ప్రథమనంది, నాగనంది, సోమనందీశ్వరస్వామి ఆలయాలు శివరాత్రి వేడుకలకు ముస్తాబయ్యాయి. స్వామి వారికి అభిషేకాలు, రుద్రాభిషేకం, లింగోద్భవ కాలం, బిల్వార్చనలను చేయడానికి ఏర్పాటు పూర్తి చేశారు. భక్తులు సందర్శన కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు.
- ప్రథమ నందీశ్వర దేవస్థానంలో బుధవారం రాత్రి లింగోద్భవ సమయం అనంతరం కల్యాణోత్సం నిర్వహించనున్నారు. అదే విధంగా గుడిపాటిగడ్డ మల్లికార్జున దేవస్థానంలో విశేష పూజలు జరగనున్నాయి.
- స్థానిక భద్రావతి భావనారుషి ఆలయంలో భవానీ సహిత భావ నందీశ్వరస్వామికి లఘున్యాసక పూర్వక ఏక రుద్రాభిషేకం, సహస్ర బిల్వార్చన నిర్వహించనున్నారు. తర్వాత స్పర్శ దర్శనం కల్పిస్తారు.
- భగవత్ సేవా సమాజ్ ఆధ్వర్యంలో లింగోద్భవ కాలంలో అష్టోత్తర కలశ క్షీరాభిషేకం, కళ్యాణం నిర్వహించనున్నారు. అనంతరం సంజీవనగర్, శ్రీనివాసనగర్‌లలో ఉత్సవ విగ్రహాలకు గ్రామోత్సవం చేయనున్నారు.
- రోజాకుంటలోని నాగలింగేశ్వరస్వామి ఆలయంలో శివరాత్రి ఉత్సవాల సందర్భంగా స్వామి వారికి అభిషేకాలు, అర్చనలు చేయనున్నారు.

ఆధార్ క్యాంపులు

నంద్యాల(న్యూటౌన్): నంద్యాల పురపాలక సంఘం పరిధిలోని వార్డుల్లో ఆధార్ కార్డు నమోదు, సవరణల కోసం ఈనెల 24వ తేదీ నుంచి 28వ తేదీ వరకు వివిధ వార్డుల్లో ఏర్పాటు చేసిన ఆధార్ క్యాంపులను పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ నిరంజన్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. సచివాలయ సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలకు ప్రజలకు అవగాహన కల్పించి సద్వినియోగం చేసుకునేలా చొరవ తీసుకోవాలని సూచించారు.

అల్లూరులో ఆధార్ క్యాంపులు

ఉయ్యాలవాడ: మండలంలోని అల్లూరు గ్రామ సచివాలయంలో ఈ నెల 27, 28 తేదీల్లో ఆధార్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సచివాలయం పరిధిలోని ప్రజలు ఆధార్ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

క్రీడా పోటీల అబ్జర్వర్‌గా పరశురాముడు

నంద్యాల(న్యూటౌన్): తెలంగాణ రాష్ట్రం నల్గొండ పట్టణంలోని నలంద కళాశాల క్రీడా ప్రాంగణంలో మార్చి 1వ తేదీ నుంచి 3వ తేదీ వరకు నిర్వహించే సౌత్‌జోన్ షూటింగ్ బాల్ అబ్జర్వర్‌గా పరశురాముడిని నియమించారు. ఈ మేరకు బాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ప్రధాన కార్యదర్శి జిత్‌రాజ్ తోమార్ నుంచి ఉత్తర్వులు అందినట్లు ఆయన తెలిపారు. ఇప్పటికే ఆంధ్రప్రదేశ్ షూటింగ్ బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శిగా.. షూటింగ్ బాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియాలో ఎగ్జిక్యూటివ్ మెంబర్ హోదాలో ఉన్నట్లు చెప్పారు. గతంలో ఏషియన్, వరల్డ్ కప్ షూటింగ్ బాల్ పోటీల్లో భారత జట్టు మేనేజర్‌గా వ్యవహరించినట్లు పేర్కొన్నారు.

పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్న ఇంటర్ ప్రశ్నపత్రాలు

శిరివెళ్ల: మార్చి 1వ తేదీ నుంచి ప్రారంభం కానున్న ఇంటర్మీడియెట్ పరీక్షలకు సంబంధించిన ప్రశ్నపత్రాలు మంగళవారం పోలీస్ స్టేషన్‌కు చేరుకున్నాయి. యర్రగుంట్ల జీటీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల పరీక్షా కేంద్రం చీఫ్ సూపరింటిండెంట్ రమణకుమారి, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్ రాంమోహన్ పత్రాల బండిళ్లను సరి చూసుకున్నారు. బందోబస్తు మధ్య వాటిని స్టేషన్‌లో భద్రపరిచారు. అధికారులు మాట్లాడుతూ.. ప్రథమ, ద్వితీయ సంవత్సరాలకు సంబంధించి సెట్ 1, 2, 3 ప్రశ్నాపత్రాలు స్టేషన్‌కు వచ్చాయని వెల్లడించారు.

మీడియాపై పక్షపాత ధోరణి తగదు

నంద్యాల(అర్బన్): శాసనసభ సమావేశాలకు పలు చానళ్లు, ప్రింట్ మీడియా రిపోర్టర్లను అనుమతించకపోవడంపై ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్టు రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శ్యాంసుందర్‌లాల్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మధు, ఉస్మాన్‌బాషా మండిపడ్డారు. నంద్యాలలోని యూనియన్ కార్యాలయంలో సోమవారం వారు మాట్లాడుతూ.. అసెంబ్లీ సమావేశాలకు సాక్షి టీవీ, సాక్షి పేపర్, టీవీ9, ఎన్‌టీవీ, టెన్‌టీవీ, తదితర విలేకరులను అనుమతించకపోవడం తగదన్నారు. ఈ విషయంలో స్పీకర్ నిర్ణయం సరైంది కాదన్నారు. ముఖ్యమంత్రి అధికారిక సమావేశాలకు కూడా కొన్ని పత్రికలు, చానళ్లను పిలవకపోవడం తగదని.. కూటమి ప్రభుత్వం తమ వైఖరిని మార్చుకోవాలని సూచించారు.

గుర్తింపు సంఖ్య ఆధారంగానే సంక్షేమ ఫలాలు



సమావేశంలో మాట్లాడుతున్న ఏడీఏ మురళీకృష్ణ

గోస్పాడు: రైతులు గుర్తింపు సంఖ్యను నమోదు చేసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి మురళీకృష్ణ అన్నారు. మంగళవారం మండలంలోని ఒంటివెలగల గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా గ్రామ రైతులతో అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భూమి ఉన్న ప్రతి రైతు ప్రత్యేక గుర్తింపు సంఖ్య కోసం నమోదు చేసుకోవాలని తెలిపారు. పంట మార్పిడితో అధిక దిగుబడులు సాధించవచ్చని చెప్పారు. అవసరం మేరకే ఎరువు, పురుగు మందులు వాడాలని రైతులకు సూచించారు. సంక్షేమ పథకాల గురించి చర్చించారు. రైతులకు యూరియా కొరత లేకుండా అవసరమైనంత మేరకు సరఫరా చేసేలా చర్యలు చేపట్టామన్నారు. ఎరువు, పురుగుమందుల దుకాణాల యజమానులు ఎమ్మార్పీ కంటే ఎక్కువ మొత్తంలో విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. మండల వ్యవసాయ అధికారి స్వప్నికా రెడ్డి, ఏఈఓలు బాల నరసింహుడు, రామకృష్ణ, కీర్తి, అగ్రికల్చర్ అసిస్టెంట్ హరితేజ పాల్గొన్నారు.

వాసవీ క్లబ్‌లో నియామకం



నియామక పత్రాలను అందజేస్తున్న దృశ్యం

నంద్యాల(వ్యవసాయం): వాసవీ జాగృతి ఇంటర్నేషనల్ నంద్యాల పట్టణ క్లబ్‌కు మంగళవారం నూతన అధ్యక్ష కార్యదర్శుల నియామకం జరిగింది. ఈ సందర్భంగా గవర్నర్ బింగుమల్ల శ్యాంసుందర్ గుప్త, మలిపెద్ది నాగరాజు మాట్లాడుతూ.. రాయలసీమలోనే ప్రప్రథమంగా పట్టణంలో వాసవీ జాగృతి ఇంటర్నేషనల్ క్లబ్‌ను ఏర్పాటు చేసి నూతన అధ్యక్షుడిగా కూరాకు శ్రీనివాస్ దత్తాత్రేయ, కార్యదర్శిగా వల్లంకొండ సుబ్రమణ్యంలను నియమించామని తెలిపారు. అనంతరం వీరికి నియామక పత్రాలను అందజేసి సత్కరించారు. కార్యక్రమంలో ఇంటర్నేషనల్ సంస్థ కోశాధికారి డాక్టర్ సుంకు చంద్రశేఖర్ గుప్త, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

అడవిలో మంటలు

రుద్రవరం: మండల కేంద్రంలోని గుట్టకొండ నరసింహస్వామి ఆలయ పరిసరాల్లోని నల్లమల అటవీ ప్రాంతంలో మంగళవారం రాత్రి మంటలు చెలరేగాయి. వందలాది వృక్షాలు మంటలకు ఆహుతవుతున్నాయి. రాత్రి సమయం కావడం.. గాలులు వీస్తుండడంతో మంటలు వ్యాపిస్తున్నాయి.



కాలిపోతున్న అడవి

వైభవంగా అష్టాదళ పాదపద్మారాధన సేవ

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని సంజీవనగర్ రామాలయంలో వెలసిన లక్ష్మీవేంకటేశ్వరస్వామికి మాఘమాసాన్ని పురస్కరించుకొని మంగళవారం అష్టాదళ పాదపద్మారాధన సేవ నిర్వహించారు. స్వామి వారికి తెల్లవారుజామున సుప్రభాత సేవ, పంచామృతాభిషేకాలు నిర్వహించి పట్టువస్త్రాలతో అలంకరించారు. అనంతరం 108 బంగారు పుష్పాలతో స్వామివారికి అష్టోత్తర నామావళి నిర్వహించారు. వేద పండితుడు శ్రీకాంత్‌శర్మ, సూరయ్య, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. అలాగే శ్రీకాళికాంబా చంద్రశేఖరస్వామి దేవస్థానంలో కాళికాంబదేవికి ఉదయాన్నే సుప్రభాతసేవ, పంచామృతాభిషేకాలు నిర్వహించి పట్టువస్త్రాలు సమర్పించి ఒడి బియ్యం కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం 108 వెండి పుష్పాలతో అష్టాదళ పాదపద్మారాధన సేవ కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో ఈఓ లక్ష్మీనారాయణ, వేదపండితులు రాఘవేంద్ర, మరణాచారి, ఆరవేటి వాసు, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



అష్టాదళ పాదపద్మారాధన సేవలో వేంకటేశ్వరస్వామి